నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
హైదరాబాద్, సోమవారం 9 జూన్ 2025 RANGAREDDY



బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

# రానున్నది మన సర్కారే..

- పాత, కొత్త అనే తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా పని చేయాలి
- కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి
- బీఆర్ఎస్‌లో చేరిన కుదురుమళ్లకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు

బొంరాస్‌పేట, జూన్ 8 : రానున్నది మన ప్రభుత్వమేనని.. కొత్త, పాత అనే తేడా లేకుండా అందరూ కలిసి కట్టుగా పని చేయాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన సమక్షంలో దుద్యాల మండలంలోని కుదురుమళ్ల గ్రామానికి చెందిన 20 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మడిగే శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని.. అందరూ కలిసి కట్టుగా పని చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో నరసింహారెడ్డి, వెంకటప్ప, శివరాజ, వెంకటేశ్, బాబు, పెద్ద లక్ష్మణ్, నరసింహ, రాఘవేందర్, గోపాల్, గోవింద్ తదితరులు మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ వారికి ప్రాధాన్యం ఇవ్వడంలేదని.. అక్కడ అవమానాలను భరించలేకనే పార్టీ వీడినట్లు చెప్పారు. సీఎం సొంత నియోజకవర్గంలో పార్టీలో కొత్తగా చేరిన వారికే అధిక ప్రాధాన్యమిస్తూ.. పాత వారిని పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో బొజ్జప్ప, వెంకట్ రాములు, ఇమ్రాన్, నరేశ్‌గౌడ్, నర్సింహులు, సాయిలు పాల్గొన్నారు.

# ఆహార కల్తీ నియంత్రణకు చర్యలు

సిటీబ్యూరో, జూన్ 8 (నమస్తే తెలంగాణ): ఆహార పదార్థాల కల్తీ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వచ్చే పర్యాటకులకు కల్తీ లేని పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ఆహార భద్రతా విభాగం పనిచేస్తుందన్నారు. గతేడాదిలో 1,887 నమూనాలను సేకరించగా వాటిలో 95 నమూనాల్లో ఆహార భద్రత, ప్రమాణాల చట్టం 2006 ఉల్లంఘన జరిగినట్లు తేలిందన్నారు. ఆయా ఉత్పత్తుల కల్తీకి పాల్పడిన సంబంధిత వ్యాపారులపై రూ. 30.60 లక్షల జరిమానా విధించినట్లు చెప్పారు. 12 కేసుల్లో క్రిమినల్ చర్యలు తీసుకున్నామన్నారు. 210 శిక్షణ అవగాహన శిబిరాలు నిర్వహించి ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ వాహనం ఉపయోగించి 4,006 స్పాట్‌లో పరీక్షలు నిర్వహించినట్లు ఆయన చెప్పారు. వసతి గృహాలు, హాస్టళ్లలో విస్తృత తనిఖీలు చేపట్టి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై రూ.5.09 లక్షల జరిమానా విధించినట్లు కమిషనర్ తెలిపారు.

# మరోసారీ..!

**రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చోటు లభించకపోవడంతో ఆశావహులు తీవ్ర నిరాశకు గురయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మొదటి మంత్రివర్గ విస్తరణలోనే ఈ రెండు జిల్లాలకు స్థానం లభిస్తుందని ఎంతో ఆశపడ్డారు. రెండోసారైనా తమకు అవకాశం లభిస్తుందని ఢిల్లీ స్థాయిలోనూ పైరవీలు చేసి ఎదురు చూసినా ఫలితం లేకుండా పోయింది. అలక వహించిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేతోపాటు ఎమ్మెల్సీని కాంగ్రెస్ అధిష్ఠానం బుజ్జగిస్తున్నది.**

**-రంగారెడ్డి, జూన్ 8 (నమస్తే తెలంగాణ)**

## మంత్రివర్గ విస్తరణలో రంగారెడ్డి జిల్లాకు నిరాశే

- ఆశావహుల ఆశలపై నీళ్లు చల్లిన అధిష్ఠానం
- అమాత్యయోగం దక్కలేదని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ల అలక
- బుజ్జగిస్తున్న కాంగ్రెస్ పార్టీ హైకమాండ్

తెలంగాణకు గుండెకాయలాంటి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు మంత్రివర్గ విస్తరణలో చోటుదక్కలేదు. మంత్రి పదవిపై ఆశలు పెంచుకున్న పలువురు తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. అమాత్యయోగం దక్కకపోవడంతో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అధిష్ఠానంపై గుర్రుగా ఉన్నారు. బుజ్జగించేందుకు ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ తదితరులు ఆయన ఇంటి కెళ్లారు. మంత్రి పదవి కోసం ఆయన ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఢిల్లీ స్థాయిలోనూ పైరవీలు చేశారు. మంత్రివర్గంలో స్థానం లభించకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని గతంలో ప్రకటించారు. మంత్రివర్గంలో స్థానం కోసం కులమే అడ్డు అనుకుంటే రాజీనామా చేసి బడుగు, బలహీన వర్గాలనైనా గెలిపిస్తానని అధిష్ఠానానికి అల్టిమేటం ఇచ్చారు. ఆదివారం మంత్రివర్గ విస్తరణలో ముగ్గురికి మాత్రమే చోటు లభించి మల్‌రెడ్డి రంగారెడ్డికి మరోసారి మొండిచేయి చూపించారు. దీంతో ఆయన అలకపాన్పు ఎక్కారు. రాష్ట్ర జనాభాలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల జనాభా 47 శాతం ఉన్నప్పటికీ ఈ రెండు జిల్లాలకు స్థానం కల్పించకపోవడంపై నాయకులు, కార్యకర్తలు గుర్రుగా ఉన్నారు.

### మల్‌రెడ్డికి మరోసారి ఆశాభంగం

మొదటి మంత్రివర్గ విస్తరణలోనే తనకు అమాత్యయోగం దక్కుతుందని మల్‌రెడ్డి రంగారెడ్డి ఎన్నో ఆశలు పెట్టుకున్నా అవకాశం లభించలేదు. మంత్రివర్గ విస్తరణ అంశం తెరపైకి వచ్చిన ప్రతిసారీ ఆయన ఢిల్లీకి వెళ్లి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు అత్యంత సన్నిహితుడైన బెంగళూరుకు చెందిన ఓ వ్యక్తి ద్వారా ముమ్మర యత్నాలు చేశారు. రంగారెడ్డికి రెండో విడత మంత్రివర్గ విస్తరణలో స్థానం దక్కుతుందని అందరూ ఊహించగా అనూహ్యంగా ఆయన పేరు జాబితాలో లేకపోవడంతో తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు.

### రెండు జిల్లాలపై కనికరం చూపని కాంగ్రెస్

గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలుపొందారు. రంగారెడ్డి జిల్లాలోనూ ఎక్కువ మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే విజయం సాధించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఈ రెండు జిల్లాలకు మంత్రివర్గంలో స్థానం కల్పించలేదనే ఆరోపణలున్నాయి. రంగారెడ్డి జిల్లాలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఫ్యూచర్‌సిటీ, ఇతర పరిశ్రమలు, ఐటీ సంస్థలు వస్తున్నా జిల్లాకు మంత్రివర్గంలో స్థానం దక్కడం లేదు. గ్రేటర్ హైదరాబాద్‌లో గత బీఆర్ఎస్ హయాంలో నలుగురు మంత్రులుండగా.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క మంత్రికి కూడా స్థానం కల్పించలేదు. తెలంగాణ రాష్ట్రానికి గుండెకాయలాంటి ఈ రెండు జిల్లాలను కాంగ్రెస్ విస్మరిస్తున్నదనే ఆరోపణలున్నాయి.

### బల్మూర్ వెంకట్‌కూ నిరాశే..



హైదరాబాద్ నుంచి మంత్రివర్గంలో స్థానం కోసం ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కూడా తీవ్రంగా పైరవీలు చేశారు. మంత్రివర్గంలో స్థానం లభిస్తుందని ఆశించగా.. ఆయన ప్రయత్నాలు కూడా ఫలించలేదు.

### వచ్చే విస్తరణలో అవకాశమిస్తాం

మంత్రివర్గ విస్తరణలో మల్‌రెడ్డికి మంత్రి పదవి వస్తుందని అందరం భావించాం. కానీ, కులాల సమీకరణలో ఆయనకు అవకాశం దక్కలేదు. రాష్ట్ర జనాభాలోనే అత్యధికంగా ఉన్న హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని అధిష్ఠానం కూడా భావించింది. రాష్ట్రంలో మరో మూడు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. వాటి భర్తీ సమయంలో మల్‌రెడ్డి రంగారెడ్డికి లేదా ఆయన కోరుకున్న వ్యక్తులకు మంత్రి పదవి కచ్చితంగా వచ్చేలా అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తా. 'మల్‌రెడ్డి రంగారెడ్డి బాధ, ఆవేదన విన్నాం. ఈ విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషిచేస్తా' అని అన్నారు.

**-మహేశ్‌కుమార్‌గౌడ్, టీపీసీసీ అధ్యక్షుడు**



మల్‌రెడ్డి రంగారెడ్డితో ఆయన నివాసంలో చర్చలు జరుపుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

### చర్చల అనంతరం మెత్తబడ్డ మల్‌రెడ్డి రంగారెడ్డి

మంత్రివర్గ విస్తరణలో మల్‌రెడ్డి రంగారెడ్డికి స్థానం దక్కకపోవడంతో ఆయన్ను బుజ్జగించేందుకు అధిష్ఠానం రంగంలోకి దిగింది. ఏఐసీసీ పరిశీలకురాలు మీనాక్షినటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదివారం సాయంత్రం 4:30 గంటలకు తిరుమలహిల్స్‌లోని మల్‌రెడ్డి ఇంటికి వస్తున్నామని సమాచారమిచ్చారు. రంగారెడ్డి ముఖ్య అనుచరులు, పార్టీ నాయకులంతా రంగారెడ్డి నివాసానికి చేరుకున్నారు. 5 గంటలకు రావాల్సిన వారు 7:30 గంటలకు వచ్చారు. అయితే మీనాక్షి నటరాజన్ హాజరుకాలేదు. మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మాత్రమే మల్‌రెడ్డి ఇంటికి వచ్చారు. వారు ఆయనతో సుమారు అరగంటపాటు చర్చించారు. చర్చల అనంతరం రంగారెడ్డి మెత్తబడ్డారు. తర్వాత మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి మహేశ్‌కుమార్‌గౌడ్, పొన్నం ప్రభాకర్ ప్రెస్‌మీట్ నిర్వహించారు.

### మల్‌రెడ్డికి మద్దతుగా నినాదాలు

మల్‌రెడ్డి రంగారెడ్డికి అనుకూలంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ ఎదుట ఆయన అనుచరులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మల్‌రెడ్డికి న్యాయం చేయాలి, మంత్రివర్గంలో స్థానం కల్పించాలని, లేనిపక్షంలో మూకుమ్మడి రాజీనామాలు చేస్తామన్నారు.

### ఈ సారి కూడా మొండిచెయ్యే..

రెండోసారి మంత్రివర్గ విస్తరణ కూడా పూర్తయ్యింది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు మంత్రివర్గంలో మాత్రం స్థానం దక్కలేదు. ఈ రెండు జిల్లాల నుంచి గత అసెంబ్లీ ఎన్నికల్లో మల్‌రెడ్డి రంగారెడ్డి ఏకైక ఎమ్మెల్యేగా గెలుపొందారు. మొదటి మంత్రివర్గ విస్తరణలోనే ఆయనకు స్థానం లభించలేదు. రెండోసారైనా దక్కుతుందని ఆశించగా.. కులాల సమీకరణలో భాగంగా ఆయనకు మంత్రి పదవి దక్కలేదని టీపీసీసీ అధ్యక్షుడే స్వయంగా ప్రకటించారు. మరో మంత్రివర్గ విస్తరణలో కూడా ఇదే పరిస్థితి రావచ్చు!. ఇప్పటికే రెడ్డి సామాజికవర్గం నుంచి నిజామాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి గట్టిగా ప్రయత్నిస్తున్నారు. నల్గొండ జిల్లాకు చెందిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా పోటీలో ఉన్నారు. వీరిద్దరిని కాదని రంగారెడ్డికి మంత్రి పదవి దక్కుతుందా..? అనేది చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కొనసాగుతున్నారు.





# బోటింగ్ చేసి.. సరదాగా గడిపి..

**కోట్‌పల్లి ప్రాజెక్టులో పర్యాటకుల సందడి**

వేసవి సెలవులు ముగుస్తుండడం, వారాంతం కావడంతో మండలంలోని కోట్‌పల్లి ప్రాజెక్టు పర్యాటకులతో కిటకిటలాడింది. యువతీయువకులు ఉదయమే కుటుంబ సమేతంగా తరలివచ్చి ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేస్తూ సెల్ఫీలు దిగుతూ సరదాగా గడిపారు. అదేవిధంగా ఆహ్లాదకరమైన ప్రాజెక్టు అందాలను తిలకించి సహపంక్తి భోజనాలు చేశారు. పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. **-ధారూరు, జూన్ 8**

# తొలగని భూ గ్రహణం

ఆరు నెలలు గడిచినా భూసేకరణ కాలే..

**ఓల్డ్ సిటీ మెట్రోకు భూములిచ్చేందుకు అనాసక్తి**

సిటీబ్యూరో, జూన్ 8(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం అట్టహాసంగా శంకుస్థాపన చేసిన ఓల్డ్ సిటీ మెట్రో విస్తరణకు భూ సేకరణ చిక్కులు తొలగడం లేదు. మూడు నెలల్లో భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి, కూల్చివేతలు ప్రారంభిస్తామని ప్రకటించినా... క్షేత్రస్థాయిలో ఒక్క అడుగు ముందుకు సాగడం లేదు. పరిహారం విషయంలో మొదలైన సమస్యలు ఇంకా జటిలమైతూనే ఉన్నాయి. దీంతో ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు ఉన్న 7.5 కిలోమీటర్ల పొడవైన మెట్రో కోసం ఆస్తుల సేకరణ ఓల్డ్ సిటీలో నత్తనడకన సాగుతోంది. రెండో దశ మెట్రో విస్తరణలో భాగంగా పెండింగ్‌లో ఉన్న ఓల్డ్ సిటీ మెట్రోకు ఇంకా భూసేకరణ చిక్కులు పరిష్కారం కావడం లేదు. కొంతకాలంగా భూసేకరణలో ఎదురైన ఇబ్బందులతో ప్రాజెక్టు నిర్మాణం నిలిచిపోగా... తాజాగా మెట్రో పొడవును పెంచి చాంద్రాయణగుట్ట వరకు పొడిగించినా... క్షేత్రస్థాయిలో ఉన్న పురాతన, చారిత్రక కట్టడాలు ప్రధాన ఆటంకంగా మారుతుండగా.... ప్రైవేటు భూముల విషయంలోనూ కొందరు బాధితులు కోర్టులను ఆశ్రయించారు. దీంతో మొత్తంగా గుర్తించిన 900 ఆస్తుల్లో ఇప్పటివరకు 220 వాటికే పరిహారం చెల్లించినట్లు మెట్రో వెల్లడించింది. కానీ మిగిలిన ఆస్తుల సేకరణ ఎప్పటి లోగా పూర్తవుతుందనేది ఇప్పటికీ ప్రశ్నార్థకమే.

### ఆరు నెలలు గడిచినా... అదే పరిస్థితి

ఓల్డ్ సిటీ మెట్రో విస్తరణ విషయంలో న్యాయపరమైన చిక్కులే ప్రధాన అడ్డంకిగా మారుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఓవైపు ప్రభుత్వ యంత్రాంగం భూ యజమానులతో చర్చలు జరిపినా ప్రయోజనం లేకపోవడమే ఇప్పుడు ప్రాజెక్టులో పురోగతి లేకుండా చేస్తుంది. ఇక నోటిఫై చేసిన ఆస్తులన్నింటినీ సేకరించేలా... పరిహారం అందజేసిన ఆస్తులను అప్పటికప్పుడు కూల్చివేస్తున్నారు. కానీ భూ యజమానుల నుంచి ఆశించినంత స్పందన రావడం లేదు. దీంతో ప్రాజెక్టులో ఎలాంటి పురోగతి లేకుండా పోతున్నది. ఇప్పటికే డీపీఆర్‌ను కేంద్రానికి చేరగా... అక్కడి నుంచి అనుమతులు వచ్చేలోపు భూసేకరణ పూర్తి చేస్తే తప్ప.. ప్రాజెక్టు వచ్చే మూడేళ్లలో అందుబాటులోకి వచ్చే వీలు ఉండదు.



# ఆస్తిపన్ను మార్పులు, చేర్పులకు అవకాశం

సిటీబ్యూరో, జూన్ 8 (నమస్తే తెలంగాణ ) : ఆస్తి పన్ను సేవలను జీహెచ్ఎంసీ మరింత సులభతరం చేసింది. ముఖ్యంగా ఆస్తిపన్ను, స్వీయ అంచనా, ఆస్తిపన్ను సవరణ, మొబైల్ నంబరు మార్పులు, డోర్ నంబర్ సవరణ, యాజమాని పేరు మార్పిడి మొదలైన సేవలకు ఇక మీ సేవాలో దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేకుండా నేరుగా ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించింది. దరఖాస్తుదారుడు తన ఇంటి పీటీఐఎన్ నంబరు, సెల్ డీడ్ అతను పొందాలనుకున్న సేవలకు సంబంధించిన ఇతర అవసరమైన సహాయక పత్రాల ద్వారా WWW.GHMC.GOV.IN ద్వారా ఆన్‌లైన్‌లో సేవలను పొందవచ్చని కమిషనర్ ఆర్ వీ కర్ణన్ తెలిపారు. దరఖాస్తుదారుడు సంబంధిత పత్రాలతో ఆన్‌లైన్‌లో నేరుగా రెవెన్యూ శాఖకు వెళ్లవచ్చని, వాటి పరిశీలన తర్వాత ఆమోదం ఇవ్వబడుతుందన్నారు. ఆస్తిపన్ను మ్యుటేషన్ సేవలు పురోగతి దశలో ఉన్నాయని, ఈ సేవలను త్వరలో అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు.

### గ్రేటర్ @ 37.5 డిగ్రీలు

సిటీబ్యూరో: గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు భగ్గుమంటున్నాయి. మొన్నటి వరకు అడపాదడప కురిసిన వానలతో కొంత చల్లబడిన నగరం ఉష్ణోగ్రతలు.. సాధారణ స్థాయి దాటి నమోదవ్వడంతో మరోసారి వేడెక్కింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 37.5, కనిష్ఠం 25.6 డిగ్రీలు, గాలిలో తేమ 45 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా రాగల రెండు రోజులు గ్రేటర్‌లో మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు అధికారులు తెలిపారు.



చేవెళ్ల పట్టణంలోని ఓ రేషన్ షాపు ఎదుట ఎండలోనే నిల్చున్న లబ్ధిదారులు

# రేషన్ కోసం బారులు

- ఉదయం నుంచే చౌకధరల దుకాణాల ఎదుట క్యూలో నిల్చుంటున్న లబ్ధిదారులు
- ఎండ వేడికి తాళలేక అవస్థలు..
- టెంట్లు ఏర్పాటు చేయాలని వినతి

రేషన్ లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం మూడు నెలల రేషన్‌ను ఒకేసారి పంపిణీ చేస్తుండడంతో చౌకధరల దుకాణాల ఎదుట ఉదయం నుంచే బారులు తీరుతున్నారు. ఎండ వేడిమిని తాళలేక అవస్థలు పడుతున్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలోని రేషన్ షాపు ఎదుట బియ్యం తీసుకునేందుకు వచ్చిన మహిళలు, పురుషులను కింది చిత్రంలో చూడొచ్చు. బియ్యాన్ని తీసుకునేందుకు మండే ఎండలోనే క్యూలో నిల్చున్నారు. రేషన్ షాపుల నిర్వాహకులు స్పందించి టెంట్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని వారు పేర్కొంటున్నారు. **-చేవెళ్లటౌన్, జూన్ 8**

# మృగశిర సందడి

- కిటకిటలాడిన ఉమ్మడి జిల్లాలోని చేపల మార్కెట్లు

**మృగశిర కార్తె నేపథ్యంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని చేపల మార్కెట్లు కొనుగోలు దారులతో కిటకిటలాడాయి. చేపల కొనుగోలుకు డిమాండ్ పెరగడంతో ధరలు కూడా అమాంతంగా పెరిగాయి. మృగశిర కార్తె ప్రవేశించిన రోజు చేపలు తింటే మంచిది అనే నానుడి ఉండడంతో జనం కొనేందుకు ఆసక్తి చూపారు. ఇబ్రహీంపట్నం పెద్దచెరువుతోపాటు పలు చెరువుల్లో చేపల విక్రయాలు అధికంగా సాగాయి.**



ఇబ్రహీంపట్నంలో చేపలు కొంటున్న..

